



అల్లర్ల కేసులు ఎత్తివేయడంపై భగ్గుమన్న దళితులు

అల్లర్ల కేసులు ఎత్తివేస్తూ జారీ చేసిన జీవో ప్రతులను అమలాపురంలో దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు - మెయిన్‌లో

జీవో ప్రతులను దహనం చేసిన దళిత నాయకులు



వేగివారిపాలెంలో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

దళిత నాయకులపై కేసులెందుకు ఎత్తివేయడం లేదు

అల్లర్ల కేసుల ఎత్తివేతకు నిరసనగా దళిత నాయకుల నిరసన

రాజోలు, జనవరి 8: అమలాపురం అల్లర్ల కేసును ప్రభుత్వం ఎత్తి వేసినప్పుడు అంబేడ్కర్ జిల్లా సాధన కోసం శాంతియుతంగా ఉద్యమం చేసిన దళిత నాయకులపై పోలీసులు అక్రమంగా బనాయించిన కేసులు ఎందుకు ఎత్తివేయడం లేదని దళిత నాయకులు వేగివారిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబులు మాట్లాడుతూ అంబేడ్కర్ జిల్లా ఉద్యమంలో శాంతియుతంగా ఉద్యమం చేసిన దళిత నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం దారుణమని ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వం దళితులపై కేసులు ఎత్తివేయడంలో కూడా వివక్షత చూపిస్తుందన్నారు. అల్లర్ల కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పుడు శాంతియుతంగా ఉద్యమంచేసిన దళిత నాయకులపై కేసులు ఎత్తివేయకుండా వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. అల్లర్ల కేసుల ఎత్తివేతకు నిరసనగా, దళితులపై కేసులను ఎత్తివేయాలని కోరుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా దళితులందరూ జరుగుతున్న పరిస్థితులపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల జనార్దనరావు, చిలకపాటి శ్రీధర్, బొడ్డపల్లి పుల్లయ్య, దీపాటి శివప్రసాద్, విప్పర్తి మహేష్ పాల్గొన్నారు.



ఇటు సై.. అటు నై

- పందాలకు సిద్ధమన్న పందెంరాయుళ్లు.. ససేమిరా అంటున్న పోలీసులు
- ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో పందాల నిర్వాహకులు
- పేకాటలు.. పందేలు.. గుండాటలు.. రికార్డింగ్ డ్యాన్సులకు సన్నాహాలు
- ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సిద్ధమవుతున్న పందెం బరులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు : ఎస్పీ శ్రీధర్ హెచ్చరిక

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాల ముసుగులో కోడి పందాలతో సహా వివిధ రకాల జూదక్రీడల నిర్వహణకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అధికార వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. కోడిపందాలు, గుండాటలు, పేకాట, అశ్లీల రికార్డింగు డ్యాన్సులు వంటివి ఆయా ప్రాంతాల్లో నిర్వహించుకునేందుకు ప్రజాప్రతినిధుల నుంచి క్లియరెన్సు కోసం ఇప్పటికే కొన్ని బృందాలు రంగంలోకి దిగి మంతనాలు జరుపుతున్నాయి. ప్రతి ఏటా జరిగే కోడి పందాల తరహాలో ఈసారి కూడా ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ముఖ్యంగా అధికార వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధుల ప్రత్యక్ష సహకారంతో ఆ పార్టీకి చెందిన కేడరే ఈ బాధ్యతలను భుజస్కంధాలపై వేసుకునే ఏర్పాట్లుచేస్తోంది. ఇందుకోసం బరుల వారీగా ప్రజాప్రతినిధులకు వాటాలు కూడా ముట్టచెప్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లోను కోడిపందాలు, ఇతర జూద క్రీడల నిర్వహణకు పోలీసులు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తే బాధ్యులైన అందరిపైనా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కేసులు నమోదు చేస్తామని జిల్లా పోలీసు యంత్రాంగం హెచ్చరిస్తోంది. అయితే పోలీసుస్టేషన్ల వారీగా పందెంరాయుళ్లు షరా 'మామూళ్ల'గానే వారితో ఒప్పందాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. కోడి పందాలతోపాటు గుండాటల నిర్వహణ కోసం భారీఎత్తున వేలం పాటలు నిర్వహించనున్నారు. కాగా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన మండలం గెద్దనపల్లి, చెయ్యేరుల్లో భారీగా కోడి పందాలు నిర్వహించడానికి బరులు సిద్ధంచేయనున్నారు. దాదాపు ఇక్కడ క్లియరెన్సు లభించినట్టే. అదేవిధంగా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడిలో, పట్టణానికి సమీపంలో కొంకాపల్లి, ఇందుపల్లి, ఈదరపల్లి, సమనస, కామనగరువు వంటి ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహించేందుకు వైసీపీకి చెందిన కొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లితో సహా ఆ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రికార్డింగ్ డ్యాన్సులు సైతం ఏర్పాటు చేసేందుకు పైరవీలు జరుగుతున్నాయి. అల్లవరం మండలం గోడి, గోడితిప్ప, గోడిలంక, గుండెపూడి, అల్లవరం తదితర గ్రామాల్లో పందాల నిర్వహణకు నేతలు సమాయత్తమయ్యారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పందాలకోసం బరులు సిద్ధమవుతున్నాయి. బరుల వద్ద గుండాటల నిర్వహించుకునేందుకు బహిరంగ వేలాలు రహస్యంగా జరుగుతున్నట్టు తెలిసింది. రాజోలు, కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని అనేకచోట్ల పందాలతోపాటు పేకాట పోటీలు, రికార్డింగు డ్యాన్సులు వంటివి నిర్వహించడానికి పోలీసులపై వైసీపీ ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారు. కొత్తపేట ప్రభల తీర్థంలో గతంలో మాదిరిగానే ఈసారి కూడా డ్యాన్సులు నిర్వహించడానికి నిర్వాహకులు సన్నాహాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఆయా స్టేషన్ల పరిధిలో స్థానిక పోలీసు యంత్రాంగం కూడా అధికారపక్ష నేతలకు సంపూర్ణ అండదండలు అందిస్తుండడంతో సంక్రాంతి పర్వదినాల్లో అసాంఘిక, జూద క్రీడల నిర్వహణకు క్లియరెన్సు లభిస్తోంది. అయితే ఇప్పటికే కొత్తపేట నియోజకవర్గంలో కోడిపందాల సందడి మొదలైపోయింది. పోలీసులు దాడిచేసి పందెంరాయుళ్లను ఆత్రేయపురం స్టేషన్ పరిధిలో అదుపులోకి కూడా తీసుకున్నారు. కొన్నిచోట్ల పందుల పోటీలు రహస్యంగా నిర్వహిస్తున్నట్టు తెలిసింది. కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో పేకాట పోటీలు నిర్వహించడానికి ఒక బృందం సన్నాహాలు చేసుకుంటున్నట్టు తెలిసింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈసారి అధికార పార్టీకి చెందిన నేతలు ఆడింది ఆట, పాడింది పాటగానే అన్నీ సాగనున్నాయి. పోలీసులు సైతం ప్రేక్షకపాత్ర వహించేవిధంగా ఉన్నతస్థాయి పోలీసు యంత్రాంగం నుంచి జిల్లా స్థాయి అధికారులకు సంకేతాలు అందుతున్నట్టు తెలిసింది. స్టేషన్ల వారీగా స్థానికంగా ఏటా నిర్వహించే బృందాలు బరుల వారీగా రేట్లు మాట్లాడుకుంటున్నట్టు సమాచారం.

పందాలు, రికార్డింగు డ్యాన్సులు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

జిల్లాలో కోడిపందాలు, ఇతర జూద క్రీడలతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ హెచ్చరించారు. సంక్రాంతి పర్వదినాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడలతోపాటు రంగవల్లులు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసుకుని ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఓ ప్రకటనలో ఆయన విజ్ఞప్తిచేశారు. పోలీసులు విధించిన ఆంక్షలు, నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పందాల నిర్వహణకు స్థలం ఇచ్చేవారిపైనా, కత్తులు కట్టేవారిపైనా నిర్వాహకులతోపాటు గుండాట నిర్వహించే వారిపైనా కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. అటువంటి వ్యక్తులను ఇప్పటికే గుర్తించి బైండోవర్ చేసినట్టు తెలిపారు. కోడికత్తుల తయారీదారులను గుర్తించి వారిని బైండోవర్ చేసినట్టు చెప్పారు. ఎక్కడైనా పోలీసు ఆంక్షలు ఉల్లంఘించి కోడి పందాలు, గుండాట, పేకాట, రికార్డింగు డ్యాన్సులు వంటివి నిర్వహిస్తే వారికి సంబంధించిన సమాచారాన్ని సమీప స్టేషన్‌లోగానీ లేదా 100, 112 కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాల్సిందిగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కంట్రోల్ రూమ్‌లో 6305026565 నంబరుకు సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సంప్రదాయాల ముసుగులో అసాంఘిక క్రీడలు నిర్వహించకూడదని ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతోపాటు మైకుల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు తెలిపారు.



సంక్రాంతి సందడి..

పి.గన్నవరం, జనవరి 8: పి.గన్నవరం హైస్కూల్లో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంప్రదాయ వస్త్రాలను ధరించి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో అలరించడంతో స్కూలు పరిసరాల్లో సంక్రాంతి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా బాలికలు ధరించిన సంప్రదాయ దుస్తులు ఆకట్టుకున్నాయి. తొలుత విద్యార్థులు స్కూలు ఆవరణలో రంగవల్లులు వేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన ప్రభ వద్ద పూజలు నిర్వహించి తీన్‌మార్ డప్పులు, కోలాటాలతో ఊరేగించారు. అలాగే కోడిపందాలు, భోగిమంటలతో సందడి చేశారు.



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

విశ్వరూప్ ఇంటి ముందు సమగ్ర శిక్షా ఉద్యోగుల బైఠాయింపు

- 8 గంటలపాటు నిరసన దీక్ష..
- అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేత

అమలాపురం రూరల్, జనవరి8: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సమగ్రశిక్షా ఉద్యోగులు, సిబ్బంది భట్నవిల్లిలోని మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటి ముందు బైఠాయించి పెద్దఎత్తున నిరసన తెలిపారు. దశాబ్దాలకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని నినాదాలు చేశారు. సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షకు సీఐటీయూ నాయకులు నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా దీక్షను కొనసాగించారు. అనంతరం విశ్వరూప్‌కు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. సమస్యలను సీఎం జగన్‌దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు. దీక్షలో జేఏసీ జిల్లా చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు, ఎం.గంగాధరరావు, ఎస్.జాన్‌బాబు, ఇ.శ్రీనివాసరావు, ఆర్.రమాదేవి, ఎం.అనూష, గూటం నాగన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన పారిశుధ్య కార్మికులు

గేట్లు ఎక్కి నిరసన, ధర్నా



కలెక్టరేట్‌ను ముట్టడించి గేట్లు ఎక్కి కార్మికుల నిరసన

అమలాపురం టౌన్, జనవరి 8: పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండు చేస్తూ జిల్లాలోని పురపాలక సంఘాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ గేట్లు ఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకోగా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా కన్వీనర్ నూకల బలరామ్ డిమాండు చేశారు. పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పర్కిరించకుంటే పట్టణాల్లోని చెత్తనంతా ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల ముందు డంపింగ్ చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకురాలు టి.నాగవరలక్ష్మి, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు కొండ, శ్రీనివాస్, నరేంద్ర, అజయ్‌కుమార్, సుబ్బారావు, లక్ష్మీ, ప్రసన్న తదితరులు మాట్లాడారు. మండపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

ఎస్మా ప్రయోగాన్ని ఉపసంహరించాలి

28వ రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

అమలాపురం టౌన్, జనవరి8: అంగన్‌వాడీలు కొత్తగా ఏ కోరికలు కోరడంలేదని, పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలుచేయమని డిమాండు చేస్తూ నిరవధిక సమ్మెకు దిగారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు పోరాటం చేస్తుంటే దొడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకురావడాన్ని ఆయన తప్పుబట్టారు. తక్షణం ఆ చట్టాన్ని ఉపసంహరించుకుని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీలు అమలాపురంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు కొప్పుల నాగమానస, అయితాబత్తుల సుభాషిణి, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ సంఘ జిల్లాశాఖ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఐవీతోపాటు పలువురు నాయకులు పాల్గొని అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. మంగళవారం అంగన్‌వాడీల ఆందోళనలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరామ్, కె.సత్తిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, యూనియన్ల నాయకులు నిమ్మకాయల శ్రీనివాస్, విప్పర్తి మోహనరావు, కుసుమ సూర్యమోహనరావు, పోతంశెట్టి దొరబాబు, భాస్కరరావు, కె.కృష్ణవేణి, జిల్లా కోశాధికారి పి.అమూల్య, సుజాత, కె.బేబిగంగారత్నం పాల్గొన్నారు.



దేవరపల్లిలో జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న బండారు

బీసీలకు అండగా టీడీపీ

దేవరపల్లిలో జయహో బీసీ సభ

రావులపాలెం, జనవరి8: బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ అన్నివిధాలా అండగా ఉండేది టీడీపీనేని రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం దేవరపల్లిలో సోమవారం రాత్రి బీసీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జయహో బీసీ సభలో సత్యానందరావు మాట్లాడారు. బీసీలకు టీడీపీ అన్నివిధాల అండగా ఉంటుంది అనడానికి నిదర్శనంగా రాష్ట్ర పార్టీ బాధ్యతలు సైతం బీసీ నాయకుడు అచ్చెన్నాయుడికి కట్టబెట్టి గౌరవించడం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అణగతొక్కారన్నారు. శెట్టిబలజలకు 2019 ఎన్నికల్లో జగన్ అండగా ఉండి గెలిపిస్తే వారికి అన్నివిధాలా అండగా ఉంటానని చెప్పి అణిచివేతకు గురిచేశారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, గుబ్బల రమణ, షేక్ సుభాన్, కేతా శ్రీను, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై..

వినతుల వెల్లువ..

- జిల్లా కలెక్టరేట్‌కు వెల్లువెత్తిన అర్జీదారులు
- 'స్పందన'లో 293 అర్జీలు అందజేత



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

అమలాపురం టౌన్, జనవరి 8: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అమలాపురం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పోటెత్తారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీదారుల నుంచి 293 అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, ఇళ్ల స్థల పట్టాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర అంశాలపై అర్జీలను స్వీకరించినట్టు జేసీ తెలిపారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. స్పందనలో సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతి లక్ష్మీదేవి, జిల్లా వ్యవసాయాధికారి ఎ.బోసుబాబు, డీపీవో వి.కృష్ణకుమారి, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీఈవో ఎం.కమలకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద కామనగరువు మహిళలు ఆవేదన

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపించండి...

కామనగరువు గ్రామస్తులకు వన్నెచింతలపూడి గ్రామంలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారు. మూడేళ్లవుతున్నా ఇంతవరకు ఆ పట్టాలకు సంబంధించిన భూమి ఎక్కడుందో చూపించలేదు. అద్దె ఇళ్లల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నాం. ఇళ్ల స్థల పట్టా భూములు చూపిస్తే పాకో, పందిరో వేసుకుని జీవిస్తామని కంచర్ల లలిత, కంచర్ల లోవతల్లి, సానబోయిన పద్మావతి, కంచర్ల పెద్దింట్లమ్మలు కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.



భార్యను కోల్పోయా.. ఉపాధిని కల్పించండి..

గత ఏడాది ఆగస్టు 30న ఈదరపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు ఢీకొనడంతో భార్య జల్లి వాణి (29) అక్కడికక్కడే మృతి చెందింది. ముగ్గురు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ప్రమాదం జరిగినప్పుడు కుటుంబాన్ని ఆదుకుంటామని మాట ఇచ్చారు. ఇంతవరకు ప్రభుత్వపరంగా కానీ, ప్రమాదానికి కారణమైనవారుగానీ ఏవిధమైన సాయం అందించలేదు. డిగ్రీ వరకు చదువుకున్నా. ఏదొక ఉపాధిని కల్పించండి. నమ్మించి మోసం చేసిన వారిని శిక్షించాలి.

\- పిల్లలతో జల్లి నాగేంద్రకుమార్, ఇందుపల్లి



జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ జరపండి..

ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. జేపీ పవర్ వెంచర్ గడువు తీరినప్పటికీ ఆ సంస్థ పేరునే వే బిల్లులతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు 400కు పైగా లారీలతో ఇసుకను తరలిస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. మైనింగ్ శాఖ ఇచ్చిన పరిధిని దాటి తవ్వకాలు జరుగుతున్నాయి. తక్షణం ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు సంగీత సుభాష్, బొక్కా ఆదినారాయణ, దొంగ సుబ్బారావు, సూరపరెడ్డి సత్య, చేకూరి కృష్ణంరాజు తదితరులు అర్జీ అందించారు.



కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల నాయకుల ధర్నా

మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలి

ఓఎన్జీసీ, కెయిర్న్ ఎనర్జీ సంస్థల కార్యకలాపాలతో మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపద అంతకంతకు తగ్గిపోతోంది. సముద్రపు వేటపై ఆధారపడిన మత్స్యకారులను చమురు సంస్థలు ఆదుకోవాలి. ఎస్.యానాం, ఓడలరేవు కేంద్రంగా చమురు సంస్థల కార్యకలాపాలతో మత్స్య పునరుత్పత్తి ప్రక్రియ తగ్గిపోయి జీవనోపాధిని కోల్పోతున్నాం. ముమ్మిడివరం నియోజకవర్గంలో మాదిరిగానే అమలాపురం నియోజకవర్గ మత్స్యకారులకు చమురు సంస్థలు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని అమలాపురం నియోజకవర్గ మత్స్యకార నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మత్స్యకార సంఘ తాలూకా అధ్యక్షుడు పెమ్మాడి సాయిబాబు, సొసైటీ అధ్యక్షుడు లంకే శ్రీను, కొల్లు రాంబాబు, చక్కా సత్తిబాబు, అంగాడి సాయి, ధర్మాడి ఏడుకొండలు, బలసాడి వెంకటేష్, మల్లాడి రాధాకృష్ణతో పాటు 24 గ్రామాల మత్స్యకార పెద్దలు పాల్గొన్నారు.



పి.గన్నవరం నియోజకవర్గ జనసేన నాయకుల నిరసన

లంక భూములను కొల్లగొడుతున్నారు..

పి.గన్నవరం మండల పరిధిలోని లంక భూములను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. ఇప్పటికే యర్రంశెట్టివారిపాలెం వంతెన శిథిలావస్థకు చేరింది. దాంతో గంటిపెదపూడి వంతెనపై నిత్యం వందలాది లారీలతో మట్టిని తరలిస్తున్నారు. ఆ వంతెన కూలిపోతే ఆరు గ్రామాల ప్రజలకు రవాణా స్తంభిస్తుంది. తక్షణం అక్రమ తవ్వకాలు, రవాణాపై చర్యలు తీసుకుని లంక గ్రామాలకు అనుసంధానంగా ఉన్న వంతెనలు కాపాడాలని యర్రంశెట్టివారిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణితోపాటు జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, పోలిశెట్టి రాజేష్, పప్పుల సాయిబాబు తదితరులు డిమాండు చేశారు. వీరంతా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

మహిళ ఆత్మహత్యాయత్నంతో కలకలం

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు 7లో



మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అధోగతే

పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారు
వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి
మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు ధ్వజం
ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న వడ్డే శోభనాదీశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే రైతులకు అధోగతి తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీతో పాటు దానికి మద్దతు పలికే అన్ని రాజకీయ పార్టీలను ఓడించాలన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో తొలిరోజు సోమవారం ఆయన మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ సంబంధిత నల్ల చట్టాలను తిరిగి అమలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చి వేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. మోదీ పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని, అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో రైతులకు ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని, కానీ రూ.14.65 లక్షల కోట్ల కార్పొరేట్ సంస్థల రుణాలు రద్దు చేశారని మండిపడ్డారు. ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా మోదీ పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు 40 శాతం మంది రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 12న విజయవాడలో రైతాంగ సమస్యలపై భారీ స్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం స్ఫూర్తితో కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధర కోసం బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాలు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం సై అనడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారనుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి రైతు మహా ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ నాయకులు కేశవశెట్టి జెండా ఆవిష్కరించారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం రైతు ఉద్యమ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, గాలిచంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు, సింహాద్రి ఝాన్సీ, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మహాసభల సందర్భంగా రైతు సంఘాల ప్రదర్శన

ఫోరెన్సిక్ సేవలు కీలకం

ఐజీ అశోక్‌కుమార్


ఐజీని జ్ఞాపికతో సత్కరిస్తున్న శేషారెడ్డి

గండేపల్లి, జనవరి 8: నేరాన్వేషణలో ఫోరెన్సిక్ శాఖ పోలీస్ శాఖకు చాలా కీలకమైందని ఐజీ వీవీ జి.అశోక్‌కుమార్ చెప్పారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో డిగ్రీ, పీజీ కళాశాల ఫోరెనిక్స్ సైన్స్ విభాగంలో ఫోరెన్సిక్ వివిధ నూతన అన్వేషణ పద్ధతులు అలాగే వాటి అధ్యయనం అనే అంశాలపై రెండు రోజులు పాటు జరిగే జాతీయ సమావేశాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆదిత్య అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ జి. అశోక్‌కుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు విభాగంలో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మన ఆంధ్రలో ఆదిత్య విద్యాసంస్థలు ఉండడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో నేరాలు, ఆన్‌లైన్ మోసాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరాన్వేషణలో ఎటువంటి చర్యలు తీసుకుంటారో అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జై శంకర్, ఫైండర్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జస్టిస్, పోలీస్ సైన్సెస్ బెంగళూరు రాజేష్‌కుమార్, ఫోరెన్సిక్ శాఖాధిపతి, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ ఔరంగాబాద్, డాక్టర్ రంజిత్ సింగ్, డైరెక్టర్ షెర్లాక్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ న్యూఢిల్లీ శాస్త్రవేత్త మధుసూదనరెడ్డి కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లమల్లి సతీష్ రెడ్డి ప్రిన్సిపాల్ విలాస్ అనీల్ చవాన్, జగ్గంపేట, గండేపల్లి పోలీసులు పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారాలు


గోపాలకృష్ణకు అంతర్జాతీయ నాటక కళారత్న అవార్డు ప్రదానం

అమలాపురం టౌన్, జనవరి 8: మానవతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.బాలయోగి అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సేవా సమితి 49వ వార్షికోత్సవానికి వ్యవస్థాపక అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు అధ్యక్షత వహించగా బాలయోగి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సమితి మానవతా దృక్పథంతో విభిన్న రంగాల్లో సేవలు అందించడం విశేషమన్నారు. మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి రామకృష్ణారావు సేవలను ప్రశంసించారు. ప్రవాస భారతీయుడు కూచిభొట్ల ఆనంద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటక రంగ అకాడమీ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సంఘ సేవకులు మోహన్ దేవు, పేడి శర్మ, ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావుకు విశిష్ట సేవా పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, ఎంవీఎల్ఎన్ మూర్తి, కుడుపూడి శాంతిభూషణ్, వాసంశెట్టి జగదీశ్, బీవీవీ సత్యనారాయణ, కరాటం ప్రవీణ్ పాల్గొన్నారు.

టీడీపీ 'రా కదలిరా' సభకు భారీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తుని రూరల్, జనవరి 8: తునిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో 'రా.. కదలిరా..' కార్యక్రమం జరగనుంది. దీనికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తుని పట్టణ శివారు చామవరం రోడ్డును ఆనుకుని ఉన్న భారీ లేఅవుట్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం తునిలో సమావేశమయ్యారు. సభా ప్రాంగణానికి 400 మీటర్ల పరిధిలో హెలిప్యాడ్ పనులను పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈనెల 10న తునిలో జరగనున్న రా.. కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరుకానున్నారని, భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు రానున్నారని, ప్రజలు కూడా భారీ సంఖ్యలో వస్తారని కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 500పైబడి వలంటీర్లు సేవలు అందించనున్నారన్నారు.

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

ఇద్దరు యువకులు దుర్మరణం


త్రిమూర్తులు (ఫైల్)

కపిలేశ్వరపురం, జనవరి 8: రెండు వేర్వేరు బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు-కాలేరు రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన పెందుర్తి సతీష్ (19), కె.గంగవరం మండలం ఎండగండికి చెందిన కడలి త్రిమూర్తులు (32) సోమవారం రాత్రి బైక్‌లపై ఎదురెదురుగా ప్రయాణిస్తూ నల్లూరు-కాలేరు రహదారి మధ్య ఢీకొన్నారు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమైన త్రిమూర్తులు అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలపాలైన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. కాగా ఎండగండికి చెందిన త్రిమూర్తులు వివాహితుడు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్టు అంగర ఎస్ఐ చంటి తెలిపారు.

రాజమహేంద్రవరం రూరల్ నుంచే పోటీ

జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్



విలేకర్లతో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, తూర్పుగోదావరి జిల్లాలో అది మరింత తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం జనసేన పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి నిర్ణయిస్తారని.. అదే ఫైనల్ అన్నారు. చాలా సందర్భాల్లో సిట్టింగ్‌లకు సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పి ఉండొచ్చని అయితే పొత్తు ధర్మం ఉంటుందన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు త్యాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10న తునిలో జరిగే చంద్రబాబు బహిరంగ సభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. జగన్మోహనరెడ్డి తాను పేదవాడినని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనేది సంక్రాంతి పండగ ముందు తేలుతుందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై స్పందిస్తూ వైసీపీ పార్టీలో ఒక సంస్కృతి ఉంటుందని, ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు ఇలా మారుతూనే ఉంటారని, అభ్యర్థి ఎవరనేది చివరి వరకూ చెప్పలేమని దుర్గేష్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 32 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ అధికారులు

రంపచోడవరం, జనవరి 1: స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను కోరారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుమారు 32 అర్జీలు అందాయన్నారు. కాకవాడ-కొయ్యలగూడెం రోడ్డుకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని, వేముకొండ-తూన్నూరుకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని, శ్రీపురం గ్రామానికి పవర్ టిల్లర్లు సబ్సిడీపై మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రీ, డీడీ అబుసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రాఘవన్, ఈఈలు డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, సుబ్బయ్య, ఎ.రవికుమార్, సీహెచ్‌కెవీ చౌదరి, సావిత్రి, పీఏవో రాంబాబు, వైద్యాధికారులు ఇందిరా, గోపిక, సీడీపీవో సంధ్యారాణి, ఎంపీడీవో హరికృష్ణ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క


భట్టివిక్రమార్కతో మాట్లాడుతున్న శేషారెడ్డి

గండేపల్లి,జనవరి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయనకు క్యాంప్ అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ మంత్రి తోట నరసింహం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిత్య శేషారెడ్డి తనకు మంచి మిత్రుడన్నారు. ఆదిత్య క్యాంపస్ ఎంతో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందిందన్నారు. త్వరలోనే ఈ క్యాంపస్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, పేపకాయల రాంబాబు, తోట రాంజీ, తోటకూర సాయి రామకృష్ణ, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నంతో కలకలం


కలెక్టరేట్ వద్ద రోదిస్తున్న మహిళ

అమలాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. దీంతో పోలీసులు అప్రమత్తమై కలెక్టరేట్ గేట్లు మూసివేసి అర్జీదారులను తనిఖీ చేసిన తర్వాతే అనుమతించారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన కొండేపూడి జ్యోతి జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ ఎదుట కలెక్టరేట్ ప్రాంగణంలో తన సమస్యను జేసీకి చెబుతూ ఒక్కసారిగా వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై చల్లుకుని అగ్గిపెట్టె తీసేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న సిబ్బంది, ఇతరులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దాంతో జ్యోతి సమస్యను విని న్యాయం చేస్తానని హామీ ఇచ్చి జేసీ నుపూర్‌అజయ్ స్పందన హాలులోకి వెళ్లిపోయారు. అయితే ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో వారు అప్రమత్తమై బాధితురాలు కొండేపూడి జ్యోతి నుంచి కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఉప్పే బాపిరాజుకు కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకునేందుకు రూ.3 కోట్లు రుణం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి రూ.53 లక్షలు తీసుకుందని ఆరోపిస్తూ కొండేపూడి జ్యోతిపై గత కొన్ని నెలల క్రితం కోర్టు ద్వారా ప్రైవేటు కేసు వేశారు. దాంతో కోర్టు ఆదేశాలపై గత ఏడాది డిసెంబరు 11న ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే అప్పటి నుంచి జ్యోతిపై పోలీసులు, కేసు పెట్టిన ఉప్పే బాపిరాజు వేధింపులు తీవ్రం కావడంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు సమాచారం.

ముగిసిన చతుర్వేద యాగం


పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

రాజానగరం, జనవరి 8: అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ గైట్ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం క్రతువులు సోమవారం ముగిశాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బదరీలక్ష్మీ దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ, శేషపవిత్ర దంపతులు, గైట్ ఎండీ కె.శశికిరణ్ వర్మ, వెంకటలక్ష్మి దంపతులతో తిరుపతికి చెందిన దివి బాలాజీ దీక్షితులు శ్రీస్వామి, అమ్మవార్లకు వైభవోత్సవాన్ని నిర్వహించారు. చివరి రోజు మహా సుదర్శన యజ్ఞం, నిత్య కైంకర్యాలతో శ్రీవారి వైభవోత్సవం కన్నుల పండువగా ముగిశాయి. మురమళ్లకు చెందిన వేద పండితులు గంటి సుబ్రహ్మణ్యంశాస్త్రి ఘనాపాటి బ్రహ్మత్వంలో పూర్ణాహుతి చేపట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనా వద్ద ఉంచిన సింహాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం దివ్య రథాల్లో కొలువైన స్వామివార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, సీఐ పి.కాశీవిశ్వనాథ్, క్షత్రియ పరిషత్ ప్రముఖులు సత్యనారాయణరాజు, కృష్ణంరాజు పూర్ణాహుతి క్రతువులో పాల్గొన్నారు.

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యానాం, జనవరి 8: యానాం నియోజవర్గంలోని జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 20వ యానాం ప్రజా ఉత్సవాలు సోమవారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించింది. గురువారం ఆర్ ప్యాక్టర్ అధినేత వీఎస్‌రాజు నేతృత్వంలో ప్రముఖ గాయకులు శ్రీకృష్ణ, సాయి శిల్ప, స్వాతి సత్యభామ, హనుమాన్, సాయిచరణ్, సాయి సింధూర తదితరులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. యాంకర్, ప్రముఖ సింగర్ స్వాతి సత్యభామ ఉత్తేజపరిచే విధంగా యువతను ఉర్రూతలూగించారు. అనంతరం నృత్య పోటీలలో గెలుపొందిన వారు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం జితేంద్ర చేసిన మిమిక్రీ అలరించింది. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రఘునాయగం, భక్తవత్సలం నేతృత్వంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.


పాటలు పాడుతున్న శ్రీకృష్ణ బృందం

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రాజవొమ్మంగి జనవరి 8: రాజవొమ్మంగి మండలంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు మృతిచెందాడు. జడ్డంగి ఇన్‌చార్జి ఎస్ఐ వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం ప్రవీణ్ (29) సంజీవనగరం గ్రామం నుంచి చెరుకుంపాలెం వైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చెరుకుంపాలెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

చింతూరు, జనవరి 8 : చింతూరులో ఈ నెల 11, 12 తేదీలలో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

యూటీఎఫ్ నాయకులకు పోలీసుల నోటీసులు


నోటీసు అందిస్తున్న పోలీసులు

కూనవరం, జనవరి 8: జనవరి 9,10 తేదీలలో విజయవాడలోని ధర్నాచౌక్ సెంటర్‌లో జరిగే ధర్నాకు వెళ్లొద్దంటూ కూనవరం మండలం యూటీఎఫ్ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, రావాల్సిన బకాయిలకు ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని దీంట్లో భాగంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అయితే ధర్నాలకు దిగొద్దంటూ, పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు వెళ్లి ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు తెలిపారు.

'విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే'


మాట్లాడుతున్న అనిల్

కూనవరం, జనవరి 8: గిరిజన సంక్షేమ హాస్టల్‌లో జరుగుతున్న విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అని ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ అన్నారు. ఏజెన్సీలోని విద్యార్థులు పలు ఆశ్రమ పాఠశాలల్లో చనిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించకపోవడం కారణంగానే ఈ మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో ఏఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. నర్సింగపేటలో ఏ విద్యార్థికి అయినా అనారోగ్యం వస్తే వంట మనిషితో ఆస్పత్రికి పంపిస్తున్నారని ఆయన విమర్శించారు. నర్సింగపేటలో ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఓ విద్యార్థి చనిపోయిందని ఆయన అన్నారు. గిరిజన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై పోరాటం సాగిస్తామని అన్నారు. పేరుకే ఏజెన్సీ జిల్లా అని సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఐటీడీఏ పీవో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని గిరిజన సమస్యలు పరిష్కరించాలన్నారు.

న్యూఢిల్లీ సదస్సులో సహకార సొసైటీ అధ్యక్షుడు

అల్లవరం, జనవరి 8: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన మెగా కాంట్‌లీవ్ సదస్సులో రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, దేవగుప్తం సొసైటీ అధ్యక్షుడు జిన్నూరి రామారావు(బాబి), కొమరగిరిపట్నం సొసైటీ అధ్యక్షుడు గుర్రం బాబు పాల్గొన్నారు. సహకార సంఘాలను బహుళార్ధక సేవా కేంద్రాలు తీర్చిదిద్దేందుకు అవగాహన సదస్సు జరిగింది. సహకార అధ్యక్షులతో పాటు సీఈవోలు కొమ్మూరి సత్తిబాబు, నాయుడు పాల్గొన్నారు.

- భోగి మంటలు, హరిదాసు వేషధారణలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు





అంతర్వేది: అంతర్వేదిపాలెంలో జడ్పీ పాఠశాలో భోగి మంటలు, మామిడికుదురు: వివిధ వేషధారణల్లో చిన్నారులు, మండపేట: తాపేశ్వరం జడ్పీ పాఠశాలలో ముగ్గుల పోటీలు

మామిడికుదురు, జనవరి 8: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు జడ్పీ హైస్కూలు, దీప్తి స్కూలు, మొగలికుదురు హైస్కూలులో సంబరాలు చేశారు. ఆయా పాఠశాలల్లో హరిదాసు, సోదమ్మ, కొమ్మదా సరి, రైతులు తదితర వేషాలతో విద్యార్థులు అలరించారు. మామిడికుదురు దీప్తి స్కూలులో భోగి మంటవేసి కోలాటం చేస్తూ పాటలు పాడారు. విద్యార్థులు కోడిపందేలునిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంతర్వేది:అంతర్వేదిపాలెం అల్లూరి పెదబంగార్రాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించి ఉపాధ్యాయులు పంచె, కండువాలతో అందరినీ అలరించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాలిపటాలు, భోగిమంటలువేసి ఎడ్ల బండితో స్కూల్ ప్రాంగణమంతా హల్‌చల్ చేశారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారిబాబులు, హెచ్‌ఎం జాన కనకలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.గంగవరం: దంగేరు ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. భోగి మంటలు వేశారు. హరిదాసు వేషధారణలతో విద్యార్థులు అలరించారు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, హెచ్‌ఎం నేదునూరి రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: పల్లంకుర్రు జడ్పీ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బహుమతులందించారు. హెచ్‌ఎం ఆర్.రమేష్‌నాయుడు, పీఎంసీ చైర్మన్ నందిక నాగేశ్వరరావు, ఎంపీటీసీ గిడ్డి తిరుపతివెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, కోడి పందేలు, సంక్రాంతి ముగ్గులు, పిండి వంటల తయారీ, విద్యార్థినుల నృత్య ప్రదర్శనలతో సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. భీమనపల్లి హైస్కూల్లో సంక్రాంతి విజేతలకు ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి బహుమతులందించారు. కార్యక్రమాల్లో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్‌ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శిరంగు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించి సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు హరిదాసులు, కొమ్మదాసు, గోదాదేవితోపాటు పలు వేషధారణలతో అలరించారు. వివిధ సాంస్కృతిక గేయాలకు లయబద్ధంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయవస్త్రధారణతో ఆకట్టుకున్నారు. గొబ్బెమ్మలు, రంగవల్లులు వేశారు. భోగిమంట వెలిగించారు. హరిదాసు వేషాధారణలతో కీర్తనలు ఆలపించారు. ధాన్యలక్ష్మీ అవతారాలు, గంగిరెద్దు విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి, ఉపాధ్యాయులు వాడ్రేవు పద్మావతి, జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, పసుపులేటి మెహర సుజాత, భాను గాయత్రి, డి.ఎస్.ఎల్.దేవి, శ్రీమన్నారాయణ, గోవిందరాజు, విష్ణు ప్రసాద్‌రెడ్డి, విటల్ పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక ప్రియదర్శిని బాలవిహార్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో భోగిమంటలు వేశారు. ఆటపాటలతో సందడి చేశారు. సంక్రాంతి గీతాలకు నృత్యాలు చేశారు.పాఠశాల ఆవరణలో రంగవల్లులు తీర్చిదిద్దారు. పాఠశాల కరస్పాండెంట్ ఏబీసీ దేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దస్తులు ధరించారు. విద్యార్థినులు పాఠశాల ఆవరణమంతా రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. భోగి మంట వేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తా, ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ఉపాధ్యాయులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. రాయవరం రామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు హెచ్‌ఎం విపర్తి శాంతి సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం శ్రీసిద్ధార్థ పాఠశాలలోడైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వేషధారణలతో అలరించారు. సంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆశీర్వాదం, అనిలా పాల్గొన్నారు.

మండపేట: తాపేశ్వరం, మండపేటలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారంసంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, భోగిమంటలు, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నాయి. తాపేశ్వరంలో విద్యార్థినులకు రంగవల్లులు పోటీలు నిర్వహించి విజేతలకు సురుచి అధినేత మల్లిబాబు దంపతులు బహుమతులు అందజేశారు. మండపేటలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, ఎంఈవో నాయుడు రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండపేట విజ్ఞాన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ సర్వనాశనం

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



మండపేట: భవిష్యత్‌కుగ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జనవరి 8: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. చెత్తపన్ను దగ్గర నుంచి అనేక పన్నులతో ప్రజలపై మోయలేని భారం వేశారన్నారు. ఏడిదలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి తథ్యమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అవినీతి వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడి, టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ, జనసేన శ్రేణులతో వేగుళ్ల కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాలొన్నారు.

వైసీపీ ప్రభుత్వం సంక్షోభమయం

కొత్తపేట, జనవరి 8: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచకం, అన్యాయాలు తప్ప అభివృద్ధి శూన్యమని, ఏపీ సంక్షోమయంగా మారిందని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. కొత్తపేటలో సోమవారం ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్ రెడ్డి ప్రజావేదికను కూల్చివేతతో మొదలుపెట్టి ఇప్పటివరకూ రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారన్నారు. ఒక్క పక్క రైతులు, మరోపక్క యువత దిక్కుతోచని స్థితిలో ఉన్నార న్నారు. నిత్యవసరాలు, కరెంట్ చార్జీలు పెరిగి సామాన్యులు నరకయాతన పడుతున్నారన్నారు. మద్యాన్ని నిషేధిస్తానని చెప్పిన జగన్ మద్యం రేట్లను పెంచి మద్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని, ప్రజలు త్వరలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధిచెబుతారన్నారు.

వైసీపీ పాలనలో దోచుకోవడమే

రావులపాలెం, జనవరి 8: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని వనరులను దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీలేదని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా వైసీపీ మారిందన్నారు. రాష్ట్రంలో జగన్ కొత్తపేట నియోజకవర్గం నుంచి చిర్ల జగ్గిరెడ్డి ప్రకృతి వనరులను అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. కొత్తపేట నియోజకవర్గంలో అనుమతులు లేకపోయినా ఇసుక, మట్టి తవ్వకాలతో కోట్ల సొమ్ము దోచుకుంటున్నారన్నారు. దోచుకోవడంలో ముందున్న వైసీపీ ప్రజలకు కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆరోపించారు. జగన్ రాష్ట్రంలో సంక్షోభం సృష్టించారన్నారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, సాధనాల శ్రీను, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కాదు సంక్షోభం నడుస్తుంది

పి.గన్నవరం, జనవరి 8: రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు షేక్‌శుభాన్ విమర్శించారు. ఉడిమూడిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్నదని సంక్షేమం కాదని, సంక్షోభమని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో పరిశ్రమలు తెస్తే జగన్ మాఫియా తెచ్చాడన్నారు. ఒక్కచాన్స్‌అని చెప్పి ముద్దులు పెట్టి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశాడన్నారు. తోలేటి సత్తి బాబు, నక్కా సునీల్‌రాజు, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, అగ్గి రాముడు, కామాడి రాంబాబు, మేడిద సాయిపద్మనాభరావు, ఎన్.సత్తి పండు, రాణి రామకృష్ణ, కొండ్రెడ్డి సూర్యారావు పాల్గొన్నారు.

యానాంలో ప్రజాఉత్సవాలను ఎవరూ ఆపలేరు

ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం, జనవరి 8: యానాం ప్రజాఉత్సవాలను ఎవరూ ఆపలేరని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో సోమవారం జరిగిన యానాం ప్రజాఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 20ఏళ్లుగా జరుగుతున్న ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చూడాలే తప్ప నిలుపుదల చేయాలనుకోవడం సరి కాదన్నారు. యానాంలో పెండింగ్ సమస్యలను మంగళవారం సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. యానాంలో రెండు రోజుల క్రితం మూసిన పేకాట క్లబ్‌ను మొక్కుబడిగా కాకుండా శాశ్వతంగా మూతపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పేకాట క్లబ్‌లకు అనుమతుల విషయంలో రూ.లక్షల్లో లంచాలు తీసుకున్న ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. లంచాలకు సంబంధించి ఆధారాలు ప్రభుత్వానికి అందిస్తామన్నారు. యానాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా అధికారులు మల్లాడిని సత్కరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, భక్తవత్సలం, వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

పుల్లయ్యశెట్టి సేవలు ఆదర్శనీయం

అల్లవరం, జనవరి 8: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుత్తుల పుల్లయ్యశెట్టి సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ ఇళ్ళ శేష గిరిరావు, పలువురు వక్తలు కొనియాడారు. గూడాలలో అవార్డు గ్రహీత పుల్లయ్యశెట్టి-వెంకటలక్ష్మి దంపతులను సర్పంచ్ దాకారాపు చిరంజీవిరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, పోలిశెట్టి భాస్కరరావు, రాకుర్తి జయరామకృష్ణ, ఉపసర్పంచ్ పొలిశెట్టి వెంకటేశ్వరరావు, నంద్యాల సత్యనారాయణ, రామారావు, బొలిశెట్టి కొండ, పంచాయతీ కార్యదర్శి అడబాల రాజ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన ఇసుక లోడు లారీ చక్రాలు

అల్లవరం, జనవరి 8: ఓడలరేవు తీరం నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న లారీ రాడ్ విరిగిపోవడంతో ముందు చక్రాలు ఊడిపోయాయి. లారీ డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ఘనంగా జనభాగిదారి

ఆత్రేయపురం, జనవరి 8 మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జనభాగిదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళర్పించారు. నాతి బుజ్జి, ఈవోపీర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుమ్ము నుంచి రక్షణ కల్పించండి

ఆలమూరు, జనవరి 8: ఆలమూరు దేవిథియేటర్ సమీపంలో ఉన్న రైస్ మిల్లుల నుంచి వచ్చే దుమ్ము నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ సమీపంలోని కాలనీవాసులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దుమ్ము వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని దీనిపై తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీవో జాన్‌లింకన్, కార్యదర్శి ఎస్‌ఐలకు ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



రామచంద్రపురంలో మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

ముమ్మిడివరం, జనవరి 8: డిమాండ్ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 28వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలంతా స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో సీఎం జగన్ చిత్రపటానికి పచ్చిమిరపకాయల దండవేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్మా చట్టం జీవోకు వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ జీవో పత్రాలను దహనం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పొత్తూరి విజయభాస్కరవర్మ, మాజీ ఎంపీటీసీలు గుత్తాల లీలావతి, గీసాల చంద్రరావు, పలువురు నాయకులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, వి.తలుపులమ్మ, టి.శ్రీదేవి, అరుణకుమారి, సత్యవతి, విజయకుమారి, ఎస్.కనకదుర్గ, సుబ్బలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రభుత్వం తమను అణచి వేయడానికి ప్రయోగించిన ఎస్మా చట్టానికి భయపడేదే లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి మామిడికుదురు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి విగ్రహానికి వినతిపత్రం అందించారు. డిమాండ్ల పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఎన్ని అడ్డుకుంటు సృష్టించినా సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. ప్రభుత్వం డిమాండ్లు తీర్చకుండా ఎస్మా ప్రయోగిస్తే బెదిరేదిలేదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ మొండివైఖరి నిరసిస్తూ సోమవారం మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడారు.

రామచంద్రపురం: అంగన్వాడీల ఆవేదన వినిపిస్తుందా జగనన్నా అంటూ అంగన్వాడీలు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం 28వరోజు నిరసన దీక్షలు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అంగన్వాడీ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ గౌరవ వేతనం తీసుకునే అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వకుండా లేకుండా ఎస్మా ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఇలాంటి సలహాలు ఇస్తున్న వారికి కనీస ఇంగిత జ్ఞానం లేదని ఎద్దేవా చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. దీక్షలో అంగన్వాడీ నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, కె.విజయలక్ష్మి, జి.శ్రీదేవి, వీరవేణి, లక్ష్మీకాంతం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని, ఎన్ని ఎస్మాలు ప్రయోగించిన భయపడబోమని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జి.ప్రమీల, కె.కమలకుమారి, వై.లక్ష్మీకుమారి, జి.అమ్మాజీ, వి.వెంకటలక్ష్మి, కె.సూర్యకుమారి, వి.కుమారి, జి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి శివాలయంలో లక్షపత్రి పూజ

కె.గంగవరం, జనవరి 8: కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్షపత్రి పూజ నిర్వహించారు. ఏకాదశి పురస్కరించుకుని కోటిపల్లి వేదపండితుడు వంకరామకృష్ణ ఆధ్వర్యంలో పండితులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం వంక రామకృష్ణను ఆయన శిష్యబృందం సన్మానించింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మామిడికుదురు, జనవరి 8: ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతశిఖరాలు అధిరోహించాలని జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కె.వనజాకుమారి ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ సమ కూర్చిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం మామిడికుదురు హైస్కూలులో విద్యార్థులకు, మండలంలోని 12జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 541మంది విద్యార్థులకు వారు అందించారు. ఎంపీటీసీ నయినాల సీతామహా లక్ష్మి, ఎంఈవో లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేష్, ఏవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ల్యాండ్‌టైటిలింగ్ చట్టంతో ప్రజలకు నష్టం

మండపేట, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన ల్యాండ్‌టైడిలింగ్ చట్టం ద్వారా ప్రజలు ఆస్తులను కాజేసేందుకు సీఎం జగన్ చూస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆరోపించారు.స్థానికపార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైనా ఖాళీ భూమి ఉంటే, దానిపై రెండేళ్లపాటు దానిపై అపీల్ వేయకపోతే ఆ భూమి ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ఈచట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై లీలాకృష్ణ పలు ఆరోపణలు చేశారు శిరోముండనం కేసులో బాధితులకు కులధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. శిరోముండనం కేసులో నిందితులు దళితులేనన్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. త్వరలో దళితులందరితో భారీ సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, జనవరి8: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుల ద్వాదశి సందర్భంగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వి.రంగాచార్యులు సారథ్యంలో కల్యాణతంతు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, సిబ్బందిపాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో సాత్విక్ ప్రతిభ

అమలాపురం రూరల్, జనవరి 8: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో రెండోఏడాదిచదువుతున్న ద్రాక్షారపు సాత్విక్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి టోర్నమెంట్ విజేతగా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, మురళీకృష్ణ, మాధవి తెలి పారు. విజయనగరం, గుంటూరుల్లోజరిగిన రాష్ట్రస్థాయి చెస్‌పోటీల్లో సాత్విక్ ప్రథమ స్థానం సాధించాడు. విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సి పాల్స్ జేవీజీ రామారావు, ఫణిశంకర్, జక్కం వెంకటకృష్ణారావు అభినందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: కపాలదీవి
శ్రీలలిత	: యానిమల్
శేఖర్ స్క్రీన్-1	: రాఘవరెడ్డి
శేఖర్ స్క్రీన్-2	:ఆక్వామెన్
రమా	: డెవిల్
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలి

ముమ్మిడివరం, జనవరి 8: జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె విరమించి వెంటనే విధుల్లోకి చేరాలని మహిళా శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి జీవీ సత్యవాణి సోమవారం పేర్కొన్నారు. ఈ నెల6,7తేదీల్లో సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో వారి పరిధిలో గల అంగన్‌వాడీలకు ఈవిషయం తెలియచెప్పాల్సిందిగా ఇప్పటికే సూచనలిచ్చామన్నారు.

ఎస్‌ఐలైన అక్కాచెల్లెలకు సన్మానం

మలికిపురం, జనవరి 8: మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో చదివి ఎస్‌ఐలుగా ఉద్యోగాలకు ఎంపికైన కడలి అరుణ, కడలి రేవతి, ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఎంపికైన బత్తుల రాజాజీలను ఏబీవీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకుడు గణేష్ పోలిశెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మలికిపురం ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్, ఎంఈవో విజయశ్రీ, కిశోర్‌కుమార్, ప్రిన్సిపాల్ తోరం సతీష్, ఎన్.రమేష్, రావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

మలికిపురం, జనవరి 8: మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్జీ డిమాండు చేశారు. మలికిపురంలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జూనియర్, డిగ్రీ లెక్చరర్స్ గ్రూపు-1, గ్రూపు-2 పోస్టులను పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 235లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, రవికుమార్, రాపాక మహేష్, తాడి రవీంద్ర, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ సమావేశం

అయినవిల్లి, జనవరి 8: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అయినవిల్లిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమం సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందుతున్న లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాడి వెంకటాచార్య, పంచాయతీరాజ్ విస్తరణాధికారి మోహన్‌కృష్ణ, బయ్యా చినబాబు, విళ్ల దొరబాబు, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, గనిశెట్టి వెంకటేశ్వరరావు, కర్రి చిట్టిబాబు, కార్యదర్శి కొంకి రామచంద్రరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమరావతే రాష్ట్ర రాజధాని

మండపేట, జనవరి 8: రాష్ట్ర రాజధాని మూమ్మాటికి అమరావతేనని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అన్న క్యాంటీన్లు మూసివేయడం, సంక్రాంతి కానుకలు, రం జాన్‌తోఫా రద్దు చేశారన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు గాలికి వదిలేశారన్నారు. కౌలురైతులు ఆత్మహత్యలు విషయంలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలించిందన్నారు. ఎమ్మెల్యేలను బదిలీ చేసినప్పటికి వైసీపీకి ఓటమి తప్పదన్నారు. త్వరలోనే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని, జగన్ ఇంటికి వెళ్లడం తథ్యమని వేగుళ్ల అన్నారు.

స్టేట్ మోనటరింగ్ అధికారిణిగా ప్రభావతి



అంతర్వేది, జనవరి8:సఖినేటిపల్లి లంక హైస్కూలు తెలుగు ఉపాధ్యాయురాలు గండేపల్లి ప్రభావతిని ఏపీ ఎస్సీసీ స్టేట్ మోనటరింగ్ అధికారిగా నియ మించారు. ఏపీ ఎస్సీసీ డైరెక్టర్ పి.స్రవంతి నుంచి నియామక పత్రం అందుకున్నట్టు తెలిపారు. గ్రీన్ స్కూలు ప్రోగ్రాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నమోదును పర్యవేక్షించడం ఆమె ప్రధానబాధ్యతని తెలిపారు. చిత్తడి నేలల పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా విద్యా ర్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాన న్నారు. ఆమెను డీఈవో ఎం.కమలకుమారి, ఇతర అధికారులు, మండలశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం



పారిశుధ్య కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న మెట్ల రమణబాబు

అమలాపురం టౌన్, జనవరి 8: పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు డిమాండు చేశారు. ప్రాణాలకు తెగించి అరకొర వసతులతో పారిశుధ్య కార్మికులు పనులు చేయాల్సిన పరిస్థితిపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు వారితో కలిసి ఉద్యమిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 13వ రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరాన్ని టీడీపీ నాయకులతో పాటు పోస్టల్, యునైటెడ్ వర్కర్స్ వివిధ సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ జిల్లాశాఖ అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, తొమ్మండ్రు గోపీల ఆధ్వర్యంలో జరిగిన సమ్మె శిబిరంలో ఎస్.మూర్తి, ఎ.ప్రసాద్, జి.వరలక్ష్మి, అనంతలక్ష్మి, కొప్పుల బాబి, నిమ్మకాయల శ్రీను, రాయుడు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వివిధ యూనియన్ల నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రమేష్, వలవల శివరావు, కుసుమ సూర్యమోహనరావు, బత్తుల ప్రసాద్ సంఘీభావం తెలిపారు.

రామచంద్రపురం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన దీక్ష ప్రారంభించారు. ఈశిబిరాన్ని బీర్ ఫ్యాక్టరీ వర్కర్స్ కార్యదర్శి తోట సూరిబాబు, రామరాజుకాపు ప్రారంభించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. శిబిరంలో మీసాల గోపి, రాజు, కాకినాడ రామకృష్ణ, దార్ల సురేష్, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

మండపేట: సమాన పనికి సమానవేతనం ప్రభుత్వంఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని ఒప్పంద పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చాలీచాలని జీతాలు, భద్రతలేని బతుకులు తమవని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం పెడచెవిన పెట్టడం తగదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గన్నవరం టీడీపీ అసెంబ్లీ స్థానం స్థానికులకే కేటాయించాలి

పి.గన్నవరం, జనవరి 8: పి.గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న స్థానిక ఎస్సీ టీడీపీ నాయకులను అధిష్ఠానం గుర్తించాలని, రాబోయే ఎన్నికల్లో స్థానికులకే సీటు కేటాయించాలని నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరావు కోరారు. పి.గన్నవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ ఎస్సీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు నాయకులు మాట్లాడుతూ జెండా మోసిన కార్యకర్తను గుర్తించాలన్నారు. పార్టీ ఆదేశాలమేరకు నడుచుకుంటూ సైకో పాలనను అంతమొందించేందుకు కృషి చేస్తామన్నారు. చుట్టుగుళ్ల కిషోర్, బొండాడ నాగమణి, నేలపూడి దామోదరం, నక్కా సునీల్‌బాబు, కొక్కిరి లక్ష్మి, పులపర్తి చినవెంకటలక్ష్మి, శాంతకుమారి, నక్కా సత్యనారాయణ, కేదాశి చిన్న, పైడి బుజ్జి, పెదపూడి రాము, మోర్తా వెంకటేశ్వరావు, ఉండ్రు శ్రీరామరావు తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన దీక్షలు

ముమ్మిడివరం, జనవరి 8: నగరపంచాయతీ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట దీక్షలు కొనసాగిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండు చేశారు. ఉదయం చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పాల్గొని ధర్నా నిర్వహించారు. అనంతరం దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్రసాద్ వారికి సంఘీభావం తెలిపారు. శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్ కుమార్, ఎస్.వెంకటేష్, వై.రమణ, కె.శివ, కె.గోవిందరాజు, ఎస్.రామరాజు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కె.జార్జి, బి.రమణమ్మ, ఎస్.బుజ్జమ్మ, మహాలక్ష్మి, కె.శరత్ పాల్గొన్నారు.

నూతన పింఛన్లు మంజూరు

ముమ్మిడివరం, జనవరి 8: నగర పంచాయతీ పరిధిలో 3,097 పింఛన్లు ఉండగా కొత్తగా72, మండలంలో 7,033పింఛన్లు ఉండగాకొత్తగా 91మంజూరయ్యాయని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు 285 ట్యాబ్‌లు, 10వ తరగతి విద్యార్థులకు విద్యాభారతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, హితకారిణి చైర్మన్ కాశి బాలమునికుమారి, ఎంపీడీవో జె.రాంబాబు, కమిషనర్ జి.లోవరాజు, వైస్ చైర్మన్ వేటుకూరి ఎంఈవో ఆర్.ఉదయభాస్కర్, హెచ్‌ఎం బి.హనుమంతరావు, పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పోలీస్, పంచాయతీ సిబ్బందిపై దాడి

ఆత్రేయపురం, జనవరి 8: విధి నిర్వహణలో ఉన్న పోలీస్, పంచాయతీ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. లొల్ల పంచాయతీ పరిధి వెంకాయమ్మపేటలో పంట బోదె స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిరామ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని నిర్మాణదారులకు నోటీసులు జారీచేశారు. ఆక్రమణదారులు యథావిధిగా షెడ్లు నిర్మాణంచేపట్టడంతో పోలీస్, పంచాయతీ సిబ్బందితో కార్యదర్శి అక్కడికి వెళ్లి పనులు నిలుపుదల చేయాలంటూ కోరారు. కల్లూరి మణికంఠ, పెన్మింటి సాయికృష్ణలు పోలీస్, పంచాయతీ సిబ్బందిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరిపైకేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

యానాం మద్యం పట్టివేత

అయినవిల్లి, జనవరి 8: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారంతో ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. తొత్తరమూడి వద్ద కె.గంగవరం మండలానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ కారులో రూ.1.35లక్షలు విలువైన 148మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అంబాజీపేట, జనవరి 8: టీడీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గణపతి నాగసత్యనారాయణ(బాబులు) జయంతి సందర్భంగా ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య సమకూర్చిన దుప్పట్లు, దుస్తులను పేదలకు అందించారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు, మాజీ జడ్పీటీసీ బొంతు పెదబాబులు దుప్పట్లు పంపిణీ చేశారు. రవణం రాము, యడ్లపల్లి తుక్కియ్య, మోకా శ్రీను, గెల్లా అశోక్ పాల్గొన్నారు.